జూ

(ప్రతిభ మాసపత్రిక)

కలలు చమత్కారంగా ఉంటవి. మెలకువ వచ్చిన తరువాత విచారిస్తే మనస్సుకు కొన్ని కష్టం కలిగిస్తవి. కొన్ని పీడకలలు వస్తవి. పీడకలలు వచ్చిన తరువాత మేలుకోగానే దోషపరిహారార్థం యే రామనామమన్నా చేసుకుంటే మంచిదంటారు పెద్దలు. ఆ పీడకలలు వ్రాసి ప్రచురిస్తే ఎంత దోషమో? ఆ పరిహారమెట్లాగో!

కవితా లోభము చెడ్డది. ఏదో చమత్కారం ఉంటే సరి వ్రాయుమని బాధపెడుతుంది. పైగా కలలలో దారీ తెన్నూ ఉండదు.

ఒక సంగతి జరిగిందంటే వీలూ చాలూ ఉండదు. చూడండి! నేనూ, శ్రీకృష్ణదేవరాయలవారూ, నన్నయగారూ ముగ్గురము బయలుదేరినాము. ఎక్కడికి?

నేను స్వర్గలోకానికి బయలుదేరినాము అనుకుంటాను. వారిద్దరూ ఏవో అధోలోకాలకి వెళుతున్నట్లుగా నవ్వుతారు. విమానం వచ్చింది. ఎక్కమన్నాను. నవ్వినారు. నేను "విమానం కాదా" అన్నాను. నన్నయగారు మొగం అదోరీతిగా పెట్టి "ఇదొక పెద్ద చేప. దాని మీసాలు చూచావా? మనం దాని కడుపులో కూర్చోవాలి. అది యెగురుతుంది. పాతాళలోకానికి వెళుతున్నాము?" అన్నారు.

మేము దాని కడుపులో కూర్చున్నాము. 'మాతలి' చేప మీసాలు మెలిపెట్టినాడు. చేపకు కోపము వచ్చి బిగ్గరగా ధ్వని చేసింది. అతను కూడా యెక్కాడు. చేప రివ్వున ఎగిరింది.

నేను విమానం పైకి వెళుతున్నది. అంటే వారు అడుగుకి వెళుతోంది అంటారు.

విమాన మేమయిందో మేమెప్పుడు దిగినామో యెట్లా చేరినామో తెలియదు గాని మేమొక మహానగరములో ఉన్నాము. నేను నన్నయ్యగారితో 'అయ్యా! నన్నీ నగరానికి ఎందుకు తెచ్చారు' అన్నా వారు 'ఈ ఊళ్లో ఒక

జంతుప్రదర్శనశాల ఉన్నది. అది చూద్దాము" అన్నారు. నేను ఇంగ్లీషులో దానిని 'జూ' అంటారు. అన్నాను. నన్నయ్యగారు నా వంక నిదానించి చూచినారు. ఏమిటి అల్లా చూస్తారు అన్నాను. ఆయన నవ్వి యిల్లా అన్నారు. "నేను అదృష్టవంతుడను గనుక విష్ణువర్ధన మహారాజు ఆస్థానంలో ఉన్నాను. లేకపోతే!"

"లేకపోతే!"

"చెప్పమంటావా! నేనెక్కడో తెలుగు పండితుడుగా ముప్పది రూపాయిల జీతం తెచ్చుకొనేవాడను. నీవు విశ్వవిద్యాలయంలో ఏ ఎనిమిది వందలో తెచ్చేవాడివి."

అది చమత్కారం. కలలో నాకు నేనెంత జీతం తెస్తున్నట్లే అనిపించింది. అంతేకాదు. నేను నన్నయ్యగారికన్న గొప్ప వాడననిపించింది.

'జూ' కి బయలుదేరినాము. శ్రీ రాయలవారు కనిపించలేదు. రాయలవారేరని నన్నయ్య గారిని అడిగాను. నన్నయ్యగారు "వారక్కడకు రారు. మనకు తప్పదు." అన్నారు "ఎందుకు తప్పదు?"

నేను కవిని, నీవు నాకన్న గొప్పకవివి. అందుకని.'

మూర్ఖుడను కాకపోతే ఆయన నన్ను వెక్కిరిస్తున్నాడని తెలియలేదు.

బయలుదేరినాము. 'జూ' దగ్గరకు వెళ్ళినాము. నన్నయ్యగారు పేదవాడని నాకు తెలుసు. ఆయనకు రాజరాజనరేంద్రుడిచ్చిన అగ్రహారము భుక్తము జరిపేందుకు భారతీయ ప్రభువు ఎచ్చట ఉన్నాడు? అందుచేత రెండు టిక్కెట్లు నేనే కొన్నాను. లోపలికి వెళ్ళాము.

వెళ్లటంతోటే మొట్టమొదట ఏవో చేపలు చూచినాము. వాని తరువాత తాబేళ్ళు చూచినాము. తరువాత చిన్నచిన్న మృగాలను చూచినాము. తరువాత కోతులు కనిపించినవి. నన్నయ్యగారు 'ఇక్కడ ఆగవలెను' అన్నారు.

నేను దారి పొడుగునా జంతువులను పెట్టిన బోనుల మీద 'లాటిన్' భాషలోను, ఇంగ్లీషు భాషలోను వ్రాసిన మాటలను తర్జుమా చేసి నన్నయ్యగారికి చెప్పుచున్నాను. ఆయన వింటున్నాడో లేదో! నేను చూడలేదు. ఒకసారి చూస్తే వినటంలేదు. ఆయనకు యీ తర్జుమా చేసి చెప్పటంలో 'ఆయనకు ఇంగ్లీషురాదు,

నాకు వచ్చు' అన్న గర్వభావం నా మనస్సులో ఉంటూనే ఉంది. ఆయన నా మాటలు వినటం లేదని నాకు తెలిసేటప్పటికి నాకు ఆశ్చర్యం వేసింది. మరింకెవ్వరైనా అయితే వాడు మూర్ఖుడని అనాగరకుడని అనుకొనేవాడనే. కాని నన్నయ్యగారిని గురించి ఎట్లా అనుకోను? నేను కాకుండా యింకొకడెవ్వడైనా అయితే నన్నయ్యగారిని కూడా మూర్ఖుడే అనుకొనేవాడు. కాని భగవంతుడు నాకటువంటి అజ్ఞానం యివ్వనందుకు లోలోపల సంతోషించాను.

'ఇక్కడ ఆగమన్నారెందుకు?' అని అడిగాను.

నన్నయ్యగారు 'ఇచ్చట నుంచి మనుష్య సృష్టి బయలుదేరుతున్నది' అన్నారు. కోతులు కిచకిచలాడుచున్నవి. ముంజేతులు ముడిచి వికారముగా గోక్కుంటున్నవి. మేము బయలుదేరినాము.

మొదట ఒక పంజరములో ఒక నీగ్రో జాతి స్త్రీ పురుషులున్నారు. ఆ పంజరం పైన ఒక బల్ల కట్టి దానిమీద వారిని గూర్చి వ్రాసినారు. ఆ నీగ్రో స్త్రీ పురుషులు వివస్త్రులుగా ఉన్నారు. వారు మమ్ము జూచి కొట్టవచ్చినారు. నేను "ఎందుకట్లా కొట్టవస్తారు?" అని యడిగినాను.

అన్నట్లుగా మా వెంట 'జూ' అధికారి వచ్చినాడు. అతను సమాధానం చెప్పినాడు. 'వీళ్లని కొందరు మనుష్యులు తీసుకువచ్చి జంతువుల లాగా ప్రదర్శిస్తున్నారు. అందుచేత వాళ్ళకి ఏ మనుష్యులను చూచినా కోపంగానే ఉంటుంది' అని

మరి కొంతదూరం పోయినాము. అక్కడ ఒక బోనులో యింకొక యిద్దరు నీగ్రోలున్నారు. వాళ్ళు దొరలకు మల్లే లాగూలు, కోట్లు, టోపీలు పెట్టుకున్నారు. నాకు నవ్వు వచ్చినది. నన్నయ్యగారు "ఎందుకు నవ్వుతావు?" అన్నారు. నేను 'ఒక్కొక్క జాతికి ఒక్కొక్క రకము దుస్తులు అందము. వీళ్లకు యీ దుస్తులేమీ అందముగా లేవు' అన్నాను.

నన్నయ్యగారు నవ్వినాడు. ఆయన నవ్వే చమత్కారము. ఆ నవ్వు పరిహాసానికో, చమత్కారానికో, అంగీకారానికో తెలియదు.

ముందరికి నడిచినాము. ఒక పంజరము మీద బల్లపైన 'ఎఱ్ఱ హైందవులు' అని వ్రాసి ఉన్నది. లోపల ఎవ్వరూ లేరు. అక్కడనే యింకోచోట యింకొకబోనులో

'ఎర్ర హైందవులని' యిద్దరున్నారు. స్త్రీ పురుషులు. వారును దొరలవలె దుస్తులు వేసుకొని ఉన్నారు.

మరి కొంతదూరం పోయినాము. అచ్చట ఒక పెద్ద బల్లమీద 'యిచ్చట నుండి హిందువుల భాగము' అని వ్రాసి ఉన్నది.

నాకు కోపం వచ్చింది. 'మన భారతీయులను కూడా పంజరాలల్లో పెట్టారా?' అన్నాను. నన్నయ్యగారు నవ్వినారు. ఎందుకు నవ్వినారో నాకు తెలియలేదు. కాని అంతలో చమత్కారముగా – కల కదా నేను కూడా ఒక బోనులో ఉన్నాను. నాకు కోపం చచ్చేటంత వచ్చింది. కోపము కొద్దీ బోనులో ఊచలు చేతితో గ్రుద్దాను. చేతులు నెత్తురు వచ్చినవి. దూరాన్నుంచి ఎవరో నవ్వుతున్నట్లు తోచింది. అటు తిరిగి చూచినాను. అవతల ఒక బోనులో నా స్నేహితులు చాలా మంది ఉన్నారు. వాళ్ళందరూ నన్ను చూచి "ఎందుకోయీ! అల్లా విరగతొక్కుకుంటావు? సుఖంగా ఉండలేవా? దొరల మూలంగా వేళకు యింత అన్నం తింటున్నాము. సుఖపడుతున్నాము. కాలుతీసి కాలు యివతల పెట్టనక్కరలేదు. నీవు యీ 'జూ' నుంచి యింకో 'జూ'కి వెళ్ళాలంటే రైళ్లమీద తీసుకువెళతారు. విమానాల మీద తీసుకువెళతారు." అన్నారు. ఇంతలో మళ్ళీ నేనూ నన్నయ్యగారూ కలిసి వెళ్ళుతున్నాము. భారతీయులలో రకరకాల వాళ్ళని రకరకాల బోనులలో ప్రదర్శిస్తున్నారు. మొట్టమొదటి బోనులో వంగ దేశీయులున్నారు. వాళ్ళు చూచిపోవటానికి వచ్చిన దొరలతో "షేక్‌హాండు" లు యివ్వటం, ఆషామాషీ మాట్లాడటం చేస్తున్నారు. నేను వాళ్ళకు "ఎందుకా యింత సరదా' అనుకున్నాను. 'జూ' అధికారిని అడిగాను. అతనన్నాడు గదా. ఈ 'జూ' కి తరువాత వీళ్ళను అధికారులను చేస్తారు అని వాళ్ళనుకొంటున్నారు అని. 'కాబోలు' అనుకొని నేను ముందుకు నడిచాను.

ఒకచోట 'ఆంధ్రులు' అన్న బల్ల కనిపించింది. నా ప్రాణం నిలువునా నీరైంది. ఆ బల్లమీద యిల్లా వ్రాసి ఉంది. 'ఆంధ్రులు అని ప్రత్యేకంగా ఒకజాతి కాదు. వీళ్ళు మద్రాసీలలో ఒక భాగం. తుళులు, కొడగులు, సవరలు మొదలైన అడవి జాతుల వారి భాషా, వీళ్ళ భాషాఒక్కటే. వీళ్ళు కూడా హిందూ దేశంలోని యితర జాతుల వాళ్ళకు మల్లే ఒకరిని చూచి అనుకరించటం చేస్తారు. కోతులలో

నుండి మనుష్యులు పుట్టినారు. కాన వీరును కోతులకి మల్లేనే ఎదుటివాళ్ళని అనుకరిస్తూ ఉంటారు. ఈ జాతికి పౌరుషం లేదు. ఓర్పుగల జాతి. అందుచేత బానిసతనానికి పనికివస్తుంది. వాళ్ళలో కొందరికి అధికారమిస్తే వాళ్ళచేత తక్కినవాళ్ళని అదుపులో ఉంచవచ్చు. ఇది హిందూ దేశస్థుల అందరి లక్షణమని చెప్పవచ్చు. కాని ఆంధ్రులకు మరీ ప్రత్యేక లక్షణము.' దీనితో నా ప్రాణము నిస్సారపడిపోయింది. తరువాత యింకా చాలా బోనులు చూచినాను. ఒకచోట 'సోవియట్ ఆంధ్రులు' అని. ఇంకొకచోట 'సోషియలిస్టు ఆంధ్రులు' అని ఇల్లా అనేకులుగా ఆంధ్రుల్ని ప్రదర్శిస్తున్నారు. వాళ్ళని చూస్తే ఆంధ్రులనుకోటానికి వీలు లేకుండా ఉంది.

ఉన్నది ఉండగా ఉయ్యూరు మీద మేడూరు వచ్చి పడినదని వాళ్ళల్లో ఎవరికో నేను కవినని తెలిసింది. అందులో ఒకడు కళ్ళెఱ్ఱ చేసి నావంక చూశాడు. నీవు మా సంగతి వ్రాశావా జాగ్రత్త! అని నన్ను బెదిరించాడు. నేనూ, నన్నయ్యగారూ కలసి వెళుతున్నాము. దారిపొడుగునా ననయ్యగారిని చూసి నవ్వుతూనే ఉన్నారు. ఆయన నడినెత్తిన గోష్పాదమంత జుట్టు, ధోవతి, ఉత్తరీయము, మొగమున గంధాక్షతలు. చొక్కాలేదు, క్రాఫింగు లేదు. దొరటోపీ లేదు. ఇంగ్లీషు రాదు. ఇంక ఆయనను చూచి ఏ బోను దగ్గరికి వెళ్ళినా నవ్వటం, వెక్కిరించటం.

నేను 'యిది యే దేశమో?' అని అనుకున్నాను. ఊరు బయటకు వచ్చేటప్పటికి ఒక పెద్దనది ప్రవహిస్తున్నది. ప్రక్కనే సముద్రంలో పడుతున్నది. ఇది స్వర్గమైతే యిది మందాకిని, ఇచ్చట సముద్ర ముండదే?' అనుకున్నాను.

మళ్ళీ అనుకున్నాను. ఇది భోగవతి. ఇది పాతాళలోకము. సాగరులు సముద్రమిచ్చటనే కదా త్రవ్వినారు.

ఇది ఏ లోకమని నన్నయ్యగారిని గూర్చి అడుగబోయినాను. ఆయన కనిపించలేదు. ఆ రాత్రి రెండు గంటలవరకు నిద్ర పట్టలేదు. అప్పుడు నిద్రపట్టి తెల్లకు తెల్లవారి ఈ కల వచ్చింది. మేలుకొనేప్పటికి ప్రొద్దున్నే, ఎనిమిది గంటలైంది. పగటికలకు పాటిలేదు. అయినా లేచి అరచేతిలో 'శ్రీరామ' అని వ్రాసి కళ్ళకద్దుకున్నాను. అంతే.